# 47. ఉద్యమం మొదలయింది...

"ఇరవై ఆరు!" అన్నాను అతను కూర్చున్న సీటు పక్కనే వేస్తున్న అంకెని వేలితో చూపిస్తూ.

"అవును, ఇరవయ్యారే!" అన్నాడతను చెక్కు చెదరకుండా.

"నాకు ఈ బెర్త్ ఎలాట్ చేసేరు!" అన్నాను జేబులోంచి టిక్కెట్ లాగడానికి ప్రయత్నించేస్తూ.

"ఈ సీట్ నాకు ఎలాట్ చేశారు" అని నాకన్నా ముందు తన టిక్కెట్ పైకి తీసి చూపించేడతను. దానిమీద 28 అని వుంది.

నేనూ ఊరుకోలేదు. నా టిక్కెట్ మీద బెర్త్ నెంబరు 26 అని వేసుండడం పది రోజుల్నించీ గుర్తే. తీసి జబర్దస్తీగా చెయ్యిజాపేను "ఇప్పుడేంటంటావు" అన్న సవాల్ని చూపులో విసురుతూ.

కాసేపు సహ ప్రయాణికుల మన్న సంగతి మర్చిపోయి ఆగర్భ శత్రువుల్లా మాటల్తో తూట్లు పొడుచుకున్నాం. ఎదటి వరసలో కూర్చున్న ముగ్గురయితేనేం, ఆ వేపుని కిటికీల దగ్గిర కూర్చున్న ఇద్దరూ అయితేనేం, మా వేపు చూస్తూ చూడనట్టు నటిస్తున్నారే తప్ప ఎవరి పక్షానా ఒక్క మాట కూడా అన్లేదు. పోనీ మా ఇద్దరికీ మధ్య రాజీ తెచ్చేమాట కూడా అన్లేదు.

ఆఖరికి బండి కదిలే వేళకి కండక్టర్ రంగంలో ప్రవేశించేక మా ఇద్దరి వాద ప్రతివాదాలు వినిపించేం. ఒకరి మాట ఇంకోళ్లు మింగేస్తూ గొడవ గొడవ పెట్టేస్తూ.

"మీరన్నది రైట్" అన్నాడు కండక్టర్, నాతో.

"మరి లెమ్మనండి ఆయన్ని!" అన్నాను కసిగా.

"ఆయనన్నది కూడా రైటే" అన్నాడు కండక్టర్, మా ఇద్దరి మధ్యా కూర్చుంటూ "మీకిచ్చింది బర్త్ నెంబరు 26. అది రాత్రి తొమ్మిది గంటల్నుంచి అమల్లో కొస్తుంది. ఆయనకిచ్చింది సీట్ నెంబరు 28" అంటూ బెర్త్ నెంబరు చూసి నేను సీట్ నెంబరుగా అపార్థం చేసుకోడం అదీ క్లారిఫై చేసి నన్ను ఆ పొడవాటి బెంచీ మీద కిటికీ పక్కని కాక వేరే చివర్ని సెటిల్ చేసేడు కండక్టర్. అక్కడ 26 అనే అంకె చక్కని అల్యూమినియం బిళ్ళమీద అచ్చు వేసి మేకుల్తో కొట్టి వున్నట్టు ఇంతసేపూ మేం ఇద్దరం చూళ్ళేదు. "విజయవాడ వరకు ఆయన అక్కడ కూర్చుని ప్రయాణం చెయ్యొచ్చు, విజయవాడ నుంచి మద్రాసు వరకు మీరు ఈ బెర్త్ మీద పడుకొని ప్రయాణం చెయ్యొచ్చు" అని కండక్టరు మా టిక్కెట్ల సంగతి తన కాగితాల మీద గుర్తులు పెట్టేసుకుని నిష్క్రమించేడు. బ్రీఫ్‌కేసు లోంచి ఓ ఇంగ్లీషు నవల తీసుకుని కిటికీ మీద మోచెయ్యి ఆనించి చదువుకోడం మొదలెడుతూ 'ఇరవై ఆరుగాడు' నా వైపు క్రూరంగా చూడ్డం నేను చూడనట్టు నటించేను.

అదృష్టవశాత్తు ఇరవై ఏడుగారు రాలేదు. ఆ ఖాళీలో కూర్చోడానికి ఇంకెవరో వస్తారు. కండక్టర్ గారికి ఉచితరీతిని సన్మానంచేసి అంతవరకు ఊరికే కూచోకుండా నేను నా బ్రీఫ్‌కేసులోంచి న్యూస్‌పేపర్లు నేను రాసిన నవలల కాపీలు తీసి పరిచాను. ఆ పుస్తకాల్లో కొన్నిట్లో నా ఫొటోలున్నాయి. అవి చూసేడంటే చాలు, నేను మహారచయితననీ అత్యంత మిక్కిలి పాపులారిటీ గల నావెలిస్ట్‌ననీ

తెలుసుకుని కాళ్ళ బేరానికి దిగుతాడు. లేకపోతే నేనే ఏదో బేరం పెడ్తాను. నాకా ధీమా వుంది.

కిటికీ ప్రక్కనున్న సీటు చిన్న మెలికలో పోయింది. ఇంక ఈ నవలలు, న్యూస్ పేపర్లు ఇవే నన్ను రక్షించాలి. ఎంతైనా తెలుగువాడు కదా. పక్కవాడు కొన్న పేపర్లూ పుస్తకాలూ చూసి ఇస్తానని అడక్కమానడు. అడిగేడంటే చాలు, ఇందాకటి శత్రుత్వం అంతా మరిచిపోయి (అతని సంగతి కాదు నేను చెప్పడం, నేను మర్చిపోగలను. ఎందుకంటే కిటికీ దగ్గర సీటు ఇచ్చే సుఖంలో వాటా కావాలన్న కోరిక నాదే కనక)- "కొంచెం సేపు మీరు ఇటు వేపు కూర్చుంటారూ, మేష్టారూ దయచేసి? నాకు కొంచెం దగ్గు వస్తోంది; ఉమ్మడం అదీ ఉంటుంది. ఇక్కడైతే అందరికీ ఇబ్బంది." లాంటి డైలాగ్ ఏదో వదిలి అతను నాతో ప్రయాణం చేసే రెండు వందల ఇరవై మైళ్ళలో ఓ వందమైళ్ళయినా అతనికీ ఆ సీటుకీ సంబంధం తెగ్గొట్టేయ గలిగితే అంతే చాలు నన్నది నా ధ్యేయం అయిపోయింది.

హఠాత్తుగా అతను, చదువుతున్న ఇంగ్లీషు నవల పేరు రచయిత పేరుతో సహా నా దృష్టిలో పడ్డది. దాంతో నా ఆలోచనా సరళిలోనే పెద్ద మార్పు వచ్చేసింది. నా నవలలు నా న్యూస్ పేపర్లు చూసి అతను కాళ్ళబేరానికి రావడం కాదు. నేనే అతన్ని ఆ పుస్తకం అడిగి తీసుకుని వీలుంటే అతను దిగిపోయేలోగా చదివేసెయ్యవలసిన అవసరం వుంది. ఆ పుస్తకం గురించి రెండు నెలల కిందట ఓ అమెరికన్ మేగజైన్‌లో చదివాను. ఇంకా పేపర్‌బాక్ రాలేదు. నవలా రచనలో నాబోటి ప్రఖ్యాతుల్ని కూడా ప్రభావితుల్ని చేసే సరికొత్త వస్తువూ ధోరణీ అందులో ఉన్నాయట.

టైమ్ చూసుకొన్నాను. ఒంటిగంట దాటింది. ఈ రైలు విజయవాడ చేరేసరికి రాత్రి ఏడున్నర అవుతుంది. నాలుగువందల పేజీలున్న ఆ పుస్తకం నాకు ఉన్నపళంగా దొరికితే అతను దిగిపోయేలోగా చదివేసి ఇచ్చెయ్యగలను. ఎంత వేగిరం చదివెయ్యగలిగితే అంతమంచిది నాకు.

అతని చేతి వేళ్ళ మధ్యని చదివిందీ, చదవ్వలసిందీ రెండు భాగాలుగా ఏర్పడ్డ ఆ పుస్తకం తేరిపార చూసేను. ఫర్వాలేదు - నా స్పీడ్‌లో సగం స్పీడ్ చొప్పున చదివినా మూడు గంటల వేళకి అతనాపుస్తకం పూర్తి చెయ్యడం ఖాయం.

అతని దగ్గిర్నుంచి ఆ పుస్తకం మూడు గంటల వేళప్పుడు తీసుకోడమే మంచిది. రైలు విజయవాడ చేరేలోగా నేనది చదవడం పూర్తికాదు. అప్పుడు ఎక్స్యూజ్‌మీలూ సారీలూ దట్టించి ఈ పుస్తకం గురించి నేను చదివి, విని ఉన్నప్పటికీ కాపీ దొరక్క రెండు నెలల్నుంచి ఎలా అల్లాడిపోతున్నానో వివరించి దాని ఖరీదు కూడా రకీమని ఆఫర్ చేసేసి (అతనంత నీచుడు కాదు. పుస్తకం ఉదారంగా నా కిచ్చేసి మరీ వెడతాడు. నాకా మాత్రం తెలీదు? కాని, కావాలంటే డబ్బు తీసుకోండి సార్ అనడం మర్యాద కదా!) మొహమాట పెట్టేసి ఆ పుస్తకం తీసేసుకోవాలి. కాదూ కూడదూ అంటే నా నవలల్లో ఇప్పుడు నా దగ్గిర ఉన్న నాలుగు శాల్తీలూ ఆటోగ్రాఫ్ చేసి అభివందనాలతో అని రాసి ఇచ్చేసినా నష్టంలేదు. నన్ను ప్రభావితం చేయగలిగే ఒక కొత్త పుస్తకం ముందు అవెంత?

"ఇరవై ఏడు ఇక్కడేనాండి?" అంటూ వొకావిడ వొచ్చింది. తనకి కండక్టర్ ఇచ్చిన సీటు ఇద్దరు మొగాళ్ళ మధ్యనని తెలిసీ కూడా నిశ్శంకగా అక్కడ చతికిలబడిపో తోంది. ఈ పేపర్లూ అవీ యెవరివండి, కొంచెం తీస్తారా?" అంది. కిటికీ పక్కని కూర్చున్న మనిషి పుస్తకం చదువుతూ వుండడాన్ని, ఈ సరుకంతా ఆయనదే అయ్యుంటుందని తెలిసినట్టు వాటన్నిట్నీ అటువేపు తోసేసి అక్కడ కూర్చోబోయింది. "పుస్తకాలూ పేపర్లూ నావి- ఇటు ఇచ్చేయండి" అనడానికి నోరు రాలేదు. ఎందుచేతంటే అవి ఇటు గానీ వచ్చేశాయంటే 'ఇరవై ఎనిమిది' గారు వాట్ని చూసే అవకాశం బాగా సన్నగిల్లిపోతుంది. నేనెవరో అతనంతట అతను తెలుసుకోడం అసాధ్యం. నా పట్ల అతను

ఆకర్షితుడు కాకపోతే అతని దగ్గర్నుంచి నేనా ఇంగ్లీషు పుస్తకాన్ని పొందడం మరింత కష్టం అవుతుంది. అంచేత ఆవిడ నా న్యూస్ పేపర్లూ, పుస్తకాలూ ఇరవై ఎనిమిది గారి వేపు తోసేస్తే ఊరుకున్నాను. అంతేకాదు-

మీరు ఈ కొసకి వచ్చి కూర్చోండి మేడం. ఇక్కడైతే మీకు సదుపాయంగా ఉంటుంది" అని నేనులేచాను. ఆవిడ "థాంక్సండి" అంటూ సీటు మారింది. ఇప్పుడు నేను ఇరవై ఎనిమిదిగారికి బాగా చేరువయ్యానని సంతోషించేసేను.

కాని 'ఇరవై ఎనిమిది' గారు నా వేపు మళ్ళా క్రూరంగా చూసేడు. దాంతో నేను చేసిన ఘోర మహాపరాధం ఏమిటో తెలిసిపోయింది. ఏదో విధివశాత్తు అతనికి సంక్రమించిన ఒకానొక అదృష్టాన్ని అతనికి కాకుండా చేసేస్తే, పైగా ఆ అదృష్టాన్ని నేను హస్తగతం చేసేసుకుంటే ఎలా చూస్తాడో అలా చూసేడతను. కాని ఏం చెయ్యడం? పొరపాటు జరిగిపోయింది. ఇంక ఇప్పుడప్పుడే దీన్ని సరిదిద్దుకోలేను. ఆవిడ లావెట్రీలోకో (జాంపళ్ళు కొనడం కోసం) కిటికీ దగ్గిరికో వెడితే తప్ప మళ్ళీ ఆవిణ్ణి ఇరవై ఏడో నెంబర్ సీట్లో కూర్చోబెట్టలేను.

సింహాసనాన్ని హస్తగతం చేసుకుందామనుకుని కుట్రచేస్తూ చక్రవర్తికి దొరికిపోయిన మహామంత్రిలా తలవాల్చేసుకున్నాను.

దీనికి తోడు 'ఈ ఇరవై ఏడమ్మ' మంట మీద నెయ్యిపోసింది.

"కొంచెం ఆ పేపర్లూ, పుస్తకాలూ ఇటిస్తారా చూసి మళ్ళా ఇచ్చేస్తానూ?" అంది.

అవి ఆవిడకిచ్చి నా ప్రాబల్యాన్ని పెంపొందించుకోడం సంతోషకరమైన సంగతే. కాని ఏడ్చుకుంటూ తీసి ఇచ్చేను.

'అబ్బా, అబ్బా!" అని పొంగిపోతూ ఆవిడ న్యూస్ పేపర్లూ వదిలేసి నవలల్ని నవిలేసే ధోరణిలో పడిపోయింది. నా నవలల మహత్తే అంత. అవి వుంటే న్యూస్ పేపర్లక్కర్లేదు. ప్రపంచంలో ఏం జరుగుతోందీ అసలే అక్కర్లేదు.

ఆవిడ సరదాలో ఇంకా నాపీకల మీదికి ఏం ముప్పు తెచ్చి పెడుతుందో అని నేను న్యూస్ పేపర్లో తలదాచుకున్నాను.

అప్పటికి ఎదుటి సీట్లో వాళ్ళకి ఇక్కడ న్యూస్ పేపర్లున్నాయని అర్థమైనట్టుంది.

నవలలూ, కథల పుస్తకాలూ ఆకర్షించిన దానికన్నా, రైళ్ళలో న్యూస్‌పేపర్లే ఎక్కువ మందిని ఆకర్షిస్తాయి. పక్క సీట్లోంచి ఎదుటి సీట్లోంచి "ఓసారి ఆపేపర్ చూడచ్చా?" అన్న అభ్యర్థన వస్తుంది. కొందరు అడగనైనా అడక్కుండా లాగేస్తారు కూడాను. వారితో అప్పుడు, "పేపరు నిన్నటి దండీ" అని చెప్తే నిప్పుకణికను వదిలేసినట్టు వదిలేస్తారు. "నిన్నటిదా?" అని పెదవి విరుస్తారు. నిన్నటి తేదీ వేసి అచ్చుపడ్డ అన్ని పేపర్లూ తమకి కంఠస్థం వొచ్చినంత ఇదిగా.

నా ఎదుటి సీట్లో బల్లమీద కూర్చున్న ముగ్గురూ నేను తెచ్చిన రెండు ఇంగ్లీషు, తెలుగు న్యూస్ పేపర్లని వంతులు వేసుకుని షీట్లు షీట్లుగా విడదీసి చీల్చి చెండాడి ఆమూలాగ్రంగా చదివేసినంత తృప్తి, విసుగూ పొంది అజాగ్రత్తగా అక్కడ పడేసి మళ్ళీ మరోమారు చెట్లూ, టెలిగ్రాఫ్ పోల్సూ వెనక్కి వెళ్ళిపోడాన్ని గమనించడంలో పడ్డారు. ఈ కార్యక్రమం అంతా పూర్తి అయ్యేలోగా ఇరవై ఎనిమిదో నెంబరు సీట్లో టెంపరరీగా కూర్చున్న మా 'ఇరవై ఏడమ్మ' గారు నా నవలల్లో ఓ దాంటో కనబడ్డ నా ఫోటోనీ నన్నూ మార్చి మార్చి చూసి ఆనందం వ్యక్తపరిచి నన్ను ఇంటర్‌వ్యూ

చెయ్యడానికి సిద్ధపడిపోయింది. 'మీరేవూళ్ళో వుంటారు? అసలు మీ ఉద్యోగం యేమిటి? ఈ నవలలన్నీ ఎప్పుడు రాస్తూ వుంటారు? ఆఫీసులో కూర్చుని ఇలాంటివన్నీ రాసేస్తూ వుంటే మీ అధికార్లు ఊరుకుంటారా? ఒకొక్క నవల రాయడానికి ఎన్నాళ్ళు పడుతుంది? ఫలానా పత్రికవాళ్ళు ఫలానా సీరియల్ రాసినందుకు ఎంత డబ్బు ఇచ్చేరు? ఆ సీరియల్ మళ్ళా ఇదుగో ఇలాంటి పుస్తకంగా వొచ్చింది కదా, ఇలా వేసినందుకు పబ్లిషర్ ఎంత యిచ్చేరు?'' ఇలా జెనరల్ కొశ్చన్లు వేసింది. అవన్నీ అయిపోయాక 'ఇలాంటి సినిమాలు చూస్తారా? ఇంగ్లీషు నవల్సు చదువుతారా?' అంటూ మొదలెట్టి ఆ మధ్య తను చూసిన ఓ ఇంగ్లీషు సినిమా గురించి సోది మొదలెట్టింది... ....

నాకు చిర్రెత్తుకొచ్చేస్తోతంది. ఈ పాఠక మహాశయులు రోజురోజుకీ పెచ్చుమీరి పోతున్నారు. వాళ్ళకి కావలసిన కాలక్షేపం వినోదం సమర్పించడం రచయితలమైన మా డ్యూటీ. అందాల రాకుమార్తెల కథలో, లేక అట్టడుగు వర్గపు సోదరుల కథలో; మాకు శక్తున్నవి మేం రాస్తాం. చదివి వినోదమో వికాసమో పొంది వూరుకో వచ్చునా? ఊహూ. అన్ని ఆరాలు తీస్తారు. కల్పనా సాహిత్యపు ఇతివృత్తాలు పంచభూత పరివేష్టితమైన ప్రపంచం నుంచి వస్తాయి. వాల్మీకాది మహాకవులనాడు లేని సదుపాయం ఇవాళ వుంది. అదే కమ్యూనికేషన్. ఈ నిమిషంలో పశ్చిమార్థ గోళంలో ఏం జరిగితే అది మరునిమిషంలో పూర్వార్థ గోళానికి తెలుస్తోంది. ఆలస్యం లేకుండా కలిగే ఈ తెలివిడిని ఉపయోగించుకుని నా దేశ ప్రజలకి, నా భాష పాఠకులకి నాకు తోచిన విధంగా నా శక్తి మేరకు సాహిత్యాన్ని సమర్పిస్తున్నాను. ఎవరి ఉత్సుకత ననుసరించి వారు పఠితలవుతున్నారు. ఇందులో ఆరాలు తియ్యవలసిన అవసరం ఏముంది?

గట్టిగానే చెప్పేను, ఆర్గ్యుమెంటు.

'అయ్యబాబోయి. మీరు రాసినప్పుడు కన్నా మాట్లాడినప్పుడు ఇంకా కన్విన్సింగ్‌గా ఉందండి.' అంది ఇరవై ఏడమ్మ.

"ఎలావుంది మన ప్రతాపం?'' అన్న ధోరణి తెచ్చుకుని చుట్టూ చూసేను. ఇరవై ఎనిమిది గారు అఖరి పేజీ చదువుతున్నాడు.

ఆ ఇంగ్లీషు పుస్తకం ..........

నాకు కొత్త బలాన్నివ్వడానికి మరో సూపర్ సర్క్యులేషన్ పోటీ రచనకి కారణమవడానికి తగిన ఆ ఇంగ్లీషు పుస్తకం.

చకచకా, నా న్యూస్‌పేపర్లు నా నవలలు అన్నీ పోగుచేసేసి దొంతర పెట్టేను. గభాల్న అతనికి అందించడానికి వీలుగా టైమ్ చూసుకున్నాను. సాయంకాలం నాలుగు కావస్తోంది.

ఫర్వాలేదు. ఇంకో రెండున్నర గంటలపాటు వెల్తురుంటుంది. ఓ గంటపాటు పై బెర్త్ ఎక్కి కూడా చదవొచ్చు. ఆ పుస్తకం నాకు పర్మనెంటుగా ఇచ్చేయడానికి అతనికి ఇష్టం లేకపోయినా సరే శ్కానింగ్ చేసి ప్లాటు, రచనా విధానం, ప్లాను అన్నీ ఆకళింపు చేసేసుకోగలను.

"మీరేమీ అనుకోనంటే-'' అని మొదలెట్టాను.

"చెప్పండి-''

"ఆ పుస్తకం నేనొకసారి తిరగేసి ఇస్తాను''

అతను పుస్తకం అటూ ఇటూ తిప్పాడు. ముందు అట్టా వెనక అట్టా అదివరకెన్నడూ చూడని

వాడిలాగ పరిశీలించి చూసేడు. తనకీ నాకూ మధ్య చిన్న గుట్టలా పోడుపడున్న నా పుస్తకాల వేపొకసారి చూసేడు. ఓ చేత్తో ఇంగ్లీషు పుస్తకం పట్టుకునే ఉన్నాడు. రెండో చేత్తో నా పుస్తకాల్లో ఒక్కొక్కటి తిరగేసీ, మరగేసీ చూసేస్తున్నాడు. నేను ఆశించిన ప్రశ్న చాలా త్వరగానే వచ్చింది. "మీరు, ఈ పుస్తకాల రచయితా?" అని నా పేరు ఓ పుస్తకం వెనక అట్ట మీద వున్న నా ఫొటో వేలు పెట్టి చూపిస్తూ అన్నాడు.

నేను అతిమర్యాదగా నవ్వుతూ "యు ఆర్ రైట్!" అని చెప్పేను.

అతను మళ్ళీ పుస్తకం ఆఖరి పేజీలో పడ్డాడు. ఇంకేముంది, రెండు నిమిషాల్లో అయిపోతుంది...... అని, ఆ మహత్తరమైన అనుభవానికి సిద్ధం అవుతున్నాను.

అతను పుస్తకం మూశాడు. నేను చెయ్యి జాపుదామనుకుంటూనే, బావుండదని అలా చూస్తున్నాను.

అతను ఆ పుస్తకాన్ని కిటికీలోంచి బైటికి విసిరేశాడు. క్షణాల్లో నేనూ, అతనూ, నా అగమ్యగమనం; ఆ పుస్తకానికి దూరం అయిపోయాము. క్షణ క్షణానికీ దూరం పెరిగిపోతోంది...

"అయ్యో, అదేం?" అని అందరికన్నా ముందుగా ఇరవై ఏడమ్మ అడిగింది.

"మీ మేలుకోరి ఆ పని చెయ్యవలసొచ్చింది. " అన్నాడతను, డైరెక్ట్‌గా ఆమెతో. " నేను కూడా ఈయన రాసిన నవలలన్నీ చదివేను. మీరు సినిమాలే చూసేరు, ఒకటీ రెండూనూ. నేను ఆ సినిమాలకీ ఇలాంటి నవలలకీ ఆధారాలైన ఇంగ్లీషు నవలలు అన్నీ చదివేసేను. ఇప్పుడు నేను చదివి పారేసిన నవల లేదూ, అది నేనైతే చదివి అవతల పారేసేను గాని ఈయన అలా పారెయ్యరు, ఇలా పారేస్తారు." అని నా నవలల ముఖచిత్రాలు చూపించేడు. నేనివ్వకపోయినంత మాత్రం చేత ఈయనకి ఆ పుస్తకం దొరక్కపోదు. కాని ఇంగ్లీషులో ఒక చిన్న నీతి వాక్యం లాంటిది ఉంది,.... "నీకు మంచి చెయ్యడానికి అవకాశం లేకపోతే 'చెడు' జరక్కుండా చూడు. చెడు జరక్కుండా చూడ్డానికి శక్తి చాలకపోతే ఆ చెడే వీలైనంత ఆలస్యంగా జరిగే టట్టు చూడు-" అని ఆ వాక్యం అర్థం. నేనిప్పుడు చేసిందదే." అన్నాడు 'ఇరవై ఎనిమిది గాడు'.

రిజర్వేషన్ చార్ట్‌లో అతని పేరు ఉంటుంది గాని అది ఇప్పుడు నాకనవసరం.

☼

*("ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక : దీపావళి 1985)*